# కూచిమంచి జగ్గకవి ప్రణీత
# చంద్రరేఖావిలాపము

తృతీయాశ్వాసము

శ్రీరతిసతీ మనోహర
చారుతర గృహాయమాన శష్పావృత వి
స్తారభగాన్విత చంద్రీ
సీరంధ్రాశేవ్యలోల నీలనృపాలా

ఆకర్ణింపుము తావకీన కథావిధానంబు యథార్థంబుగా శ్రీశివబ్రాహ్మణ వర్ణాగ్రగణ్యుండైన వీరభద్ర భట్టారకేంద్రునకు శ్రీమద్వైఖానస వంశోత్తంసంబగు నరసింహాచార్యవర్యుం డవ్వలికథ యిట్లని చెప్పందొడంగె

అంతట పటఘటిత గృహా
భ్యంతర మహిషానుపుష్ప బంధుర బలవ
ద్దంతయుత శయ్య నమ్మహి
కాంతుడు లేకున్న దాసికలు డాసి కడున్

కళవళమందుచు మనమిట
గొలగొలమనుకొంచు చుట్టుకొని యుండగ కో
మలగతి నేడకు చనెనో
తెలియదహా దైవమాయ తీరెట్లగునో

పిక్క లూరులు కాళ్ళు పిల్లసేవకులచే
గ్రుద్దించుకొనుచుండె కొంతసేపు
పాటకుల్ పరతేర పాడించుకొంచును
కొల్వుదీరిచియుండె కొంతసేపు
హితవుమీరగ భాగవతుల మేల్వేసాల
వింత కన్గొనుచుండె కొంతసేపు

మద్దెలమ్రోయంగ గుద్దతిప్పుచునాడు
ఇంతి కన్గొనుచుండె కొంతసేపు

మంచమెక్కి యొక్కతెతోడ మదనకదన
మెంతయును చేయుచుండెను కొంతసేపు
తమలము మెసంగి పొగచుట్ట త్రాగె కొంత
సే పతం డంత నెందేగె చెప్పరమ్మ

ఏలంజె యింటికేగెనొ
ఏ లీలావతిని బలిమి నెనయించెనొ తా
నేలాగు మాయమయ్యెను
నీలాద్రినృపుండు కామినీలోలుడహో

వేంకటశాస్త్రుల యజ్ఞము
పొంకము చూడంగ లేచిపోయెనొ లే దా
వంక పులి మ్రింగిపోయెనొ
జంకయ్యేడి చెప్పరమ్మ జవ్వనులారా

ఇందు తా వెల్వడి యెందు వేంచేసెనో
మాసామి చూపరే మ్రాకులార
సన్నకసన్న నే సకి గూడియుండెనో
మా రేని చూపరే మద్దులార
వేపుల పట్టుక వేటకు పోయెనో
మా దొర చూపరే మడుగులార
ఇందర భ్రమియించి యేటికి పోయెనో
మా రాజు చూపరే జారులార

మమ్ము నేలిన నీలాద్రిమనుజవిభుడు
పూలపాన్పున పెనునిద్ర పోయిపోయి
లేచి ఒక్కరుడును మాకగోచరముగ
ఎచ్చట నడంగె చెప్పరే పచ్చులార

ఎల్లీ మల్లీ పల్లీ
పుల్లీ మా రాజకూసుపో వక మీమీ
గొల్లెనకై రాడుకదా
కల్లలు పలదింక చెప్పగదరే వేగన్

నేలరేడులార మంచినేస్తులార విక్రమా
భీల శూరులార పిన్నపెద్దలార గుప్పునన్
పూలపాన్పుడిగ్గి యేడ బోయినాడొ చూడరే
నీల కాశ్యపీవరుండు నిన్నరేయి ఒక్కడున్

అని గగ్గోలుగ వారు రోదనము సేయన్ నాయకుల్ గాయకుల్
చనవర్లున్ గణికాజనంబు లనుజుల్ సామంతులున్ మంత్రులున్
విని శోకాకులచిత్తులై కదిసి తద్వృత్తాంతమాలించి ఆ
యన నన్వేషము సేయబోయిరి సమీపారణ్యమధ్యంబునన్

గట్టుల దరి పుట్టల కడ
చెట్టుల చెంగటను చెరువు చెంతల బలు పె
న్గుట్టల సందుల గొందుల
పట్టుగ ప్రవహించు ఏటిపల్లములందున్

రోయుచు హెలా యని కూకలు
వేయుచు హా నీలభూప విస్మయముగ నీ
వేయెడ కేగితొ వెస రా
వే యనుచును మోదుకొనుచు విహ్వాలులగుచున్

మూగి అరయంగ ఆతని
తో కూడంజనిన వేట తోరపుకుక్కల్
సైగలు సేయుచు సాగగ
ఆ గతి కని చనిరి వారలందరు వెంటన్

చని కనిరి చంద్రరేఖా
తనురూపవిలాస వహ్ని దగ్ధశరీరున్

ఘన చింతాభారున్ నూ
తన జనిత దశావికారు తన్నృపమారున్

ఇట్లు కనుంగొని సకలపరివారంబు లతనిం జుట్టుకొని యాక్రందనంబు సేయుచు నాశ్చర్య ధుర్య మానసంబుతో నిట్లనిరి

వాతము పట్టెనొ వని పెను
భూతము కొట్టెనొ మరెట్టి పొడ కుట్టెనొ హా
హా తెలియ దేమి మాయయొ
ఈతడు పడియున్న చంద మెంచి కనంగన్

బహుళ ద్విజద్రవ్య భక్షణోద్భవ మహా
పాతకంబున నోరుపడియె నొక్కొ
కవిమాన్యహరణ దుష్కర్మ ప్రభూతాతి
కలుషంబుచే జిహ్వ పలుకదొక్కొ
పరసతీవ్రత భంగకరణప్రభవ పంక
గతి దుర్బలాంగంబు కదలదొక్కొ
సుజనుల చెడజూచు చూడ్కి చుట్టిన కొల
గడు కనుంగవ మూతవడియె నొక్కొ

నిరత నిజదాసికాజన నికరములను
బలిమిమై పట్టపగ లింట పట్టి మిగుల
సమరతుల తేల పొడము దోసమున నొక్కొ
నీలనరనాథు డిట్లొంటి కూలినాడు

అని మహాదుఃఖావేశంబున అందరు నిట్లనిరి

కొలువు తీర్పవదేమి గురుతర తరుసార
భాసుర లక్ష్మీవిలాసమునను
కూర్చుండవదియేమి ఘుమ ఘుమామోద గుం
భిత సుచందన కాష్ఠపీఠమునను
తేరిచూడవదేమి దృఢతర లావణ్య

గణ్య పణ్యస్త్రీ నికాయములను
పలుకరింపవదేమి బహువేష భాషాతి
బంధురాశ్రిత బాలభాగవతుల

నకట నీలాద్రిరాజ భోగానురక్తి
మాని ఈ ఘోర కాంతారమహిని పండ
కారణంబేమి ఏర్పై కాకపూని
తెగి యిటకు వచ్చి యిట్లు నిద్రించెదిపుడు

కేళీభవనాంతర పరి
కీలిత మల్లీ లతాంత కేవల శయ్యా
లోలుడపై యుండక ఈ
నేలపయిం పండనేల నీలనృపాలా

విజయరామ క్షమావిభుడు పిల్వగ పంచె
రాచిరాజ కుమార లేచిరమ్ము
ఎరుకువాడిదె పందినేసి మాంసము తెచ్చి
కాచుకయున్నాడు లేచిరమ్ము
పేటకుక్కల కాన్కపెట్టి పంపిరి దొరల్
చూచివత్తువుగాని లేచిరమ్ము
కొత్త పారావారు కొలువంగవచ్చిరి
రాచయేనుగుగున్న లేచిరమ్ము

దాసి యొక్కతె నీపొందు కాసచెంది
వాచియున్నది విషయింప లేచిరమ్ము
సలుపు గొల్పెడి పుండ్ల బూచులకు మందు
రాచికొన నీలనృప వేగ లేచిరమ్ము

అని మరియును

కదలడు పలుకడు ధాతువు
పద కరముల నుండ చూచి బ్రతుకునొ లేదో

బెదరక చెప్పు మదెట్లు
న్నదొ యీతని కో ముడుంబినరసాచార్యా

అనిన ఆతండు దగ్గర కరిగి ధాతు
గతి పరీక్షించి యితనికి కామరోగ
మంకురించిన దిక మీరు జంకుమాని
సరగ శిశిరోపచారముల్ సలుప లేచు

అని చెప్పిన వారందరు
జనితామోదంబుతోడ చల్లని పను లే
పున చేయగ సమకట్టిరి
మనుజాధిపు చెంతచేరి మక్కువమీరన్

పసుపును నూనెయు కరపద
బిసరుహముల రాచి విసము పిండి శిరమునం
దిసుమంత గొరిగి వడినిడి
వెస చెవి వెల్లుల్లి ఊద వేగమె తెలిసెన్

తెలిసి ఉస్సురనుచు నలుదిక్కులను చూచి
సైగసేయ వారు చల్లగంజి
వంటకంబు పిసికి వడిపోయ మెల్లన
గుటుకుగుటుకురనుచు గ్రోలి సోలి

తెప్పిరి కూర్చుండి అతం
డప్పుడు తన చందమెల్ల ఆప్తులతోడన్
గుప్పున ఏకాంతంబున
చెప్పిన విని లంజె యెంత చేసెనటంచున్

బొకనాసి, గడ్డ, సెగయును
అకటా యీ నీలవిభుని కంటించిన యిం
టికి నొంటికి హాని కదా
ప్రకటంబుగ పురుగు లురలిపడి చచ్చుగదా

పట్టుడు కట్టుడు కొట్టుడు
గట్టిగ తల బోడిచేసి గాడిదమీదన్
పెట్టుడు పురి వెడలంగా
కొట్టు డనిరి అందరొకట కోపముమీరన్

అప్పుడు నీలాద్రి భూమిపుండు

దాని పట్టబూను తజిబీజు కనుగొను
సాని నిట్లుసేయ చనదు నాకు
కూర్మిమీర మీరు కుస్తరిం చిటు తోడి
తెచ్చి కూర్పవలయు నిశ్చయముగ

తల గొరిగించుట కంటెన్
మొల గొరిగించుటయె మేలు ముగ్ధయగుట బల్
సలుపున కోర్వక యుంచిన
దిల విటులకు ఇంతభాగ్య మేదీ జగతిన్

సమమై రోమరహితమై
అమితమృదుత్వంబు కలిగి అశ్వత్థదళో
పమమై స్నిగ్ధంబై వెళు
పమరెడు భగమిచ్చు భాగ్యమందురు శాస్త్రుల్

ఇన్ని లక్షణంబులెన్న దాని త్రికోణ
పాళి నుండుననుచు హాళి నాదు
నంతరాత్మ తోచె నయ్యది సౌభాగ్య
వతియె సుమ్ము పెక్కువాక్కులేల

దాని యోని తీరు దాని చన్నుల చెన్ను
దాని మోము గోము దాని మోవి
కావి తీవి చెప్పగా మాకుశక్యమే
రోమములు పడంకు భీమరాజ

సిద్ధాంతివి పండితుడవు
సద్ధర్ముండవును నాకు సఖుడ వెపుడు నే
నుద్ధతి దాని రమించెద
శుద్ధగతిం జెప్పు శౌంఠిసుబ్బయ మాకున్

అని పలుకునప్పుడు పండితుండును నిష్ఠాగరిష్ఠుండును సుజ్ఞాననిపుణుండును హితుండును బ్రాహ్మణాగ్రగణ్యుండును శాంతుండును సకలజన సమ్మతుండును చతురుండును ప్రయాగవంశోత్తంసుండును అగు బాపన్న ఆపన్నుండై ఆ పగిది వాపోవుచు కన్నులు తేలవైచుచున్న ఆ నీలాద్రి మన్నరేనిం కనుంగొని వినయ విసంభ్ర గాంభీర్యంబులు గుంభింప గంభీర భాషంబుల మెల్లమెల్లన యిట్లనియె

పరనారీ సోదరుడవు
పరతత్వ విశారదుడవు బహురాజ సభాం
తర నుత కీర్తివి వేశ్యా
తరుణీమైథునము సేయ తలపం తగునే

చెరవు చేసితివిగా చెలగి బాడవ క్రింద
సద్రాజు లెన్న సముద్రముగను
వనము నిల్పితివిగా వర్ణింపరాకుండ
వీక నరట్ల కుప్పాక నడుమ
మాన్య మిచ్చితివిగా మహిషి మూలంబున
శౌంఠిసుబ్బయ్యకు క్షుద్రభూమి
నా కిచ్చితివి కదా నాలుగైదు వరాలు
పేశలగతిని వర్షాశనముగ

వివిధ సంగ్రామ జయరామ విజయరామ
రాజ కరుణాకటాక్ష నిర్వ్యాజ లబ్ధ
సకలసామ్రాజ్య ఖనివి నీ వకట యొక్క
పుప్పి బోగపులంజకై పొగులదగునె

ఇల్లును ఒళ్ళును గుల్లగు
పెల్లలరెడు రాజ్యలక్ష్మిపెంపు హరించున్
గుల్లాపు సానిదానిన్
మళ్ళని తమి కోరితీవు మరి రతి సలుపన్

వద్దు సుమీ యిది కూడని
పద్దు సుమీ నాదు మాట పాలించితివా
ముద్దు సుమీ ఆ సానిది
మొద్దు సుమీ దానిదెంగు మోహంబేలా

జగ్గ కవిరాజు చేతం
పగ్గెయు సిరి వోవ తిట్లుపడితివి చంద్రిన్
మగ్గము పెట్టిన మొదలే
నెగ్గవయో నీలభూప నృపసుమచాపా

అప్పు డప్పలుకులు విని కటకటంబడి కటమదర పండ్లు పెటపెటం గొరికి చటుల క్రోధ కుటిలారుణలోచనుండై తదీయ ప్రధాన ప్రధానుండగు ఆదుర్తి భీమ నామ మంత్రి అతని కిట్లనియె

ప్రభుచిత్త మెవ్విధంబున
ప్రభవించునొ అట్లె నీవు పలుకక వడి ని
ట్లు భయము మాని పలికెదవు
సభలో వారెల్ల కడు నసహ్యత పడగన్

ఒంభూలు చేసికొంచును
జంభంబులు కొట్టుకొనుచు జడమతి నశుభా
రంభము లరయుచు తిరిగెడి
దంభపు విప్రునకు నీకు తగదిది చనుమా

పప్పుదప్పళంబులొప్ప తప్పొప్పులు
సెప్పుకొంచు తడక విప్పుకొంచు
చదువుకొంచు తిరుగ ఛాందసుల్ మీరలు
రాచకార్యములకు రాగ తగునె

కైశ్యంబేలా విధవకు
వైశ్యునకున్ సమర విజయవాంఛ లవేలా
వశ్య యయి కులికి పైబడు
వేశ్యారతిసుఖము వేదవేద్యున కేలా

అనిన నమ్మంత్రిజన పుంగవున కాత డిట్లనియె

నిష్ఠవిహీనుండవు ఘన
నిష్ఠుర మాయాప్రలాపనిపుణుడ వీవే
జేష్ఠ వితనిని నియోగి
జ్యేష్ఠుల లోపలను చేర్చి చెప్పగనేలా

తిరుమణియు తులసిపేరులు
తిరువారాధనయు పెద్ద తిరుగూడ వెసన్
ధరియించి ముష్టికిప్పుడె
తరలుము మంత్రాంగముడిగి దాసరివగుచున్

బంధుడును పండితుడు కూరపాటి రాయ
మంత్రివర్యుం డతని తోలు మడతవెట్టి
కొట్టి సన్యాసి జేసితి విట్టివాడ
వితని కులశేఖరుని చేయుటెంత నీకు

ఇయ్యనీయవుగదా ఎంత సత్కవి వచ్చి
ప్రస్తుతించిన పూటబత్తెమైన
ఉండనీయవుగదా చండపండిత రాజ
మండలంబును సభామంటపమున
నిల్వనీయవుగదా నిమిషమాత్రంబైన
ఆశీర్వదించు ధరామరులను
చూడనీయవుగదా వేడుకతోపాడు
గానవిద్యా ప్రౌఢగాయకులను

కూసుమత మార్గరతుడవై కులము విడిచి
తిరిగి నీవిందుజేరి మంత్రిత్వమూని
త్రిప్ప నీలాద్రిరాజిట్లు మెప్పెయయ్యె
భీకరవ్యాజ ఆదుర్తి భీమరాజ

సామంబేమియు లేదు సాంత్వనవచస్సందర్భమున్ నాస్తి దు
ర్గ్రామణ్యం బధికంబు కాముకతయున్ కాపట్యమున్ హెచ్చుగా
భీమామాత్యుడవంచు పల్కుదురు నిన్ పృధ్విన్ యదార్ధం బహెూ
నీ మంత్రాంగముచేత నేడు చెడియెన్ నీలాద్రిరాజెంతయున్

గణికశ్రేష్టుడ వయ్యో
గణకాంగణపొందు రాజుగారికి తగదం
చణుమాత్రము చెప్పవు నీ
గుణము తెలిసివచ్చె బుద్ధికుశలుడవు భళీ

అని వారిరువు నిటువలె
ఘన ఘనరవ సదృశ నాద గద్గదగళులై
కినుక వివాదింపంగా
విని చింతలపాటి నీలవిభు డిట్లనియెన్

మీరేటికి వాదించెద
రూరక యుండుండు చెలిమి యొప్పారంగా
గౌరవమున నామదిగల
ఆరాటము తీర్ప బాప డసమర్ధుడుగా

రతిచింత చేత నిప్పుడు
మతివోయిన రీతినుండు మాకున్ సుద్దుల్
హితమతి చెప్పెదు పోపో
పతిచిత్త మెరుంగలేవు బాపడవయ్యున్

అని యతనిమీద రోషసంఘటిత చిత్తుండగుట గనుంగొని తత్సన్నిధిగలవార లేగుమనిన నతండరిగె
నంత భీమరాజుం జూచి యేకాంతంబున నిట్లనియె

బాపడని నేస్తుడనియును
నోపిక చేసితిని గాని యొడుతును జుమ్మీ
పాపమున కోడ కిమ్మెయి
బాపన్నను భీమరాజ పటుకోపమునన్

అనిన భీమరాజతని కిట్లనియె

అదనైన పంది పొడవవొ
ఎదురించిన పులిని పొడవొ ఏన్గు పొడవవో
కదనమున శత్రు పొడవవొ
వదరుచు నెదురాడు నట్టి పారు పొడవవో

అని భీమరాజు పలికిన
విని మనమున సంతసించి వేడుకతో ని
ట్లనియెను చంద్రిని వేగం
బనుకూలము సేయకున్న హా యెట్లోర్తున్

కోకిల కీర శారికల కూకలకున్ కలహంస కేకినీ
భీకర నిర్ఘరార్భటికి పెగ్గిలితిన్ మరి చెప్పనోప నెం
దాక సహించువాడ వెస దానిత్రికోణము తెచ్చిచూపుమా
నా కెదలోని మన్మథ కనద్ ఘన పావకతాప మారగన్

మరి విచారింపనది ఆడిమళ్ళ వేంక
టాభిధాన ప్రజాపతి అంశ పుట్టె
సకల రతిబంధ చాతుర్యసరణి కనియె
పూని వర్ణింప దాని కేసాని సవతు?

కావున వేంకటశాస్త్రికి
నా వలపెరుగంగ చెప్పినను నాతడు తా
నావలిపని సమకూర్చును
వేవేగమె భీమరాజ విచ్చేయవయా

అని చెప్పి

పనిచిన నాతడేగి కనె ఖంజిత నీలతరాజకాయ సం
జనిత కరోటికూటము వసాస ఘృత ప్లుత సత్పలాశ మాం
స నికర వర్ధమాన విలసత్ పటు వహ్ని శిఖాప్రభాట మ
త్యనుపమ మంత్రతంత్రకర యాజక ఝాటము యజ్ఞవాటమున్

కనుగొని తచ్చాలాంతర
మున దక్షుడుబోలె దజ్ఞ ముగ్రంబున తా
నొనరించు వేంకటమఖిన్
చనవున కని రాజకార్యసంగతి తెలిపెన్

తెలిపిన మఖి అత్యంతము
పులుపువొడమ భీమమంత్రి పుంగవ పెస తా
తలచిన పని సమకూర్తును
చెలిమి వెలయ నీ మఖంబు చెల్లిన పిదపన్

దాతయు దైవము నేతయు
ఏతీరున కన్న నతడె యెప్పుడు కానన్
నీతోడు భీమరాజా
ఆతని పనిసేయు టుచితమగు గద మాకున్

అని రాజుగారి కంతయు
వినయంబున తెలుపుమనుచు వేడిన నతడున్
చని యట్ల చెప్ప నీలా
పనివిభుడు గుడారమునను వనరుచునుండెన్

అనంతరంబున నయ్యారామద్రావిడ బాడబాగ్రగణ్యుండగు వేంకటసోమపీథి నిరతపర్యుషి తాన్నదానవిధాన సంక్రుద్ధ సుప్రసిద్ధ వృద్ధ భూమీసుర వారా నివారిత భూరితర దారుణ భాషావిశేష దూషితంబును ప్రచండతర చండాలసరోవర పరిసర పరికల్పితానల్ప విశాల శాలాతట తటుల కుటిలాచ్ఛ మత్స్యపుచ్ఛాచ్ఛాదిత కృపీట సంపాద్యమా నాహీన పురోడాశప్రము ఖాయోగ్యవస్తు యాగభాగాను రాగారహిత విహిత మహిత బృందారకబృందంబును యథావిధివన్నిర్ధారిత

దక్షిణాక్షీణ పదార్థ వంచనాగుణ నిరస్తోత్సాహ సాహస ధావన్మహాసోమయాజి విరాజితంబును
జామాత్య మూర్ఖ మహాకఠినవాక్య తర్జన భర్జన పలాయిత సకలదేశ సమాగత వివిధ విప్రప్రకరంబును
పరమ పరిహాసక పరికల్పిత స్వచ్ఛచ్ఛాగ నాదామోదిత వేదితలాంతర పరివర్తిత ధూర్త పండిత
పామరజన సమూహంబును బ్రాహ్మణార్థ సంపాదిత బహుళ సత్ఫల శాక పాక భక్ష్య భోజ్య దధి
ఘృత గుడాదిక వస్తుస్తోమ చౌర్యక్రియాకౌశల యాతాయాతాతతాయి శ్రేష్ఠ కుమారనారాయణశాస్త్రి
విశ్రుతంబును సంభావనా సంభ్రమాలోకనార్థ సమాగత వితత వారాంగనా భుజంగపుంగవ శృంగార
కేళీగృహాయమాన శాలా సమీప ప్రదీప్త విశాల కాయమాన నికాయంబును విపులా
పూపశరావోపమానూన పీనోపస్థాస్థల వికీర్ణాస్తోకానేక దీర్ఘతర శ్యామల కోమల రోమస్థోమోద్ఘాటన
పాటవ ప్రోల్లసద్బాలవిధవా విరాజితాంతర్గేహంబును విదార్యమాణ పశు విసర కళేబర సంజనిత
ఘనతర క్షరిత క్షతజ ప్రవాహా బిందుసందోహ గ్రసన వ్యసన సంభ్రమ భ్రమద దభ్ర శుభ్ర గృధ్ర కాక
ఘూక కంక కౌలేయక గనయ గోమాయ ప్రముఖ వన్య ఖగ మృగజాల కోలాహల బధిరీకృత
జనసమూహంబును పరమ నిర్భర నిర్భాగ్య దామోదర దురోదర మృగయావినోదామోదౌఖ
నీలాద్రినృపాల బాలిశ దుష్కర కరాగ్ర సమర్పిత యాగఫల దానధారాపూరంబునుంగా క్రతువు
సమాప్తంబు గావించి జన్నంబు బన్నంబు లేకుండ కడతేరె మదీయపుత్త్రియు నిజముఖ కళావిలాస
తిరస్కృత చంద్రరేఖయగు చంద్రరేఖను కోమలాలంకారభవ్య యగు నా కావ్యకన్యకకును
నుత్తముండగు నీలాద్రినృపుండు వరుండయ్యెడు సమయంబునయ్యె మామకీన భాగ్యమహిమంబు
చెప్పతరంబె యని సంతుష్టాంతరంగుండై చని చని

పూతిగంధాధార పుంఖిత డిండీర
భరిత మైరేయ కుంభవ్రజంబు
గ్రామసూకర మాంసఖండ తోరణ వార
కంక వాయస గృధ్రసంకులంబు
మేదుర ఖాదనామోద సంపాదిత
తామ్రచూడాసహ్య తటతలంబు
రతిరాజ సంగరోత్థిత షిద్గజన శుక్ల
మూత్రార్ధ గేహాళీచిత్రితంబు

విటవిటీజన సంధాన విహితవచన
నిచయ రచనా నిపుణ కుట్టనీసహాయ

కరణ కారణ కౌలేయకంబు వేంక
టాభిధానాతినీచ వేశ్యాలయంబు

ఇటునటు కనుగొని లోనికి
లొటలొట చని మంచమెక్కి లోలత నది త
త్తటమున కూర్చుండిన న
క్కుటిలాత్ముడు కౌగలించుకొని యిట్లనియెన్

ఎంతభాగ్యంబు చేసితి మిరుపురమును
కాసువిడకుండ యజ్ఞంబు కలిగె చంద్ర
రేఖను తలచి నీలాద్రిరేడు మిగుల
మోహితుండయ్యె భాగ్య మామోదమొదవె

నీలాద్రి రాజు మిక్కిలి
తాళక కృశియించె విరహదహనముచే నీ
వేళం జచ్చును వేగం
బాలోలత చంద్రినంపు మాతనికడకున్

పూలమ్రాకులు నీవు నీపుత్రికయును
చూచువల్ల యెరింగి బొజుగుల వలపు
పెల్లి గొలుపుచు బలువుగ విత్తమెల్ల
లాగుదురు ధాత్రి మీవంటి లంజెలేరి

నేడు నీకల్లుడాయెను నీలనృపుడు
కూతురును నీవు నేనును కొదవలేని
సిరుల పొదలెదమింక ఈ చిన్నదాని
కడక కైసేయుమని చంద్రి కాంచి పలికె

బాలరో నీవు మిగుల సౌభాగ్యవతివి
ఒక బొజుగుపోవ మరియొక్క డుత్తముండు
దొరకె నీలాద్రిరాజు సచ్చరితుడిపుడు
నిన్నుగోరి పిలువనంపె నేడు నీవు

ఏలాగున నలయించెదొ
ఏలాగున నీలవిభుని వలయించెదొ మ
మ్మేలాగున రక్షించెదొ
బోలె తెగడు నీదు భగము పుణ్యముచేతన్

అనిన చంద్రరేఖ యిట్లనియె

చూపుకోపులచేత చుంబనంబులచేత
దంతక్షత నఖక్షతములచేత
తాడనంబులచేత పీడనంబులచేత
గాఢ పరీరంభకలనచేత
ఉపరతిగతులచే కపటవాక్యములచే
తాంబూలదాన విధంబుచేత
కలపంబుపూతచే గారవింపులచేత
గాన నాట్య ప్రసంగములచేత

మందు మంత్రంబులను నీలమనుజవరుని
లోలు గావించి కలధనం బోలి లాగి
పిదప జోగిగ గావించి మదముడించి
తెత్తు మీసన్నిధి నా ప్రతిజ్ఞ వినుడు

దొడ్డదొడ్డ తురకబిడ్డల నా తొడ
లందు నిరకబట్టి అడుగునెత్తి
పెట్టి లోలుజేసి పెట్టివానిగజేతు
నీలనృపుడు నాకు చాలగలడె

అనిన నీవంత నేర్పరివగుదు వమ్మ
లెమ్మ ముస్తీబు కమ్మ శీఘ్రమ్ముగాను
పొమ్మ ఆతనితమి తీర్ప కమ్మవిల్తు
చేతి బంగరుబొమ్మ ఓ చిన్నికొమ్మ

నావు డల చంద్రి యప్పుడు
భావంబలరార లేచి పరిపరిగతులన్
వేవేగ చేయదొడగెన్
కేవల శృంగార మొడల గీలుకొనంగన్

నీలాద్రిరాజు మోమున
గ్రాలెడు గడ్డంబురీతి కనుపట్టి మహా
స్థూలోపస్థా భాసా
భీలత నూరుహము లన్ని బిరబిర పెరికెన్

ఆతని పెను బాలీసుల
భాతిన్ కడుపొడవులగుచు ప్రబలు కుచములం
దాతత మలయాచల సం
జాత సుగంధంబు మిగుల జానుగ నలదెన్

ఘుగఘుగ సుగంధ బంధుర
మగుచుండెడు ధూపమిడియె ఆనందమునన్
నిగనిగలీనెడు తన ఘన
భగదేవత కాత్మవాంఛ ఫలియించుటకున్

గొరైబొచ్చు కంటె ఎర్రనై చిర్రలౌ
కుర్రపెండ్రుకలను కూడదువ్వి
తొర్రకొప్పుపెట్టి నర్రుమీదను చాల
విర్రవీగుకొంచు బిర్రబిగియ

హరిమొగము తెగడు మొగమున
హరిదళమును దళముగాగ నలది మహా సిం
ధురతర నేత్రయుగంబున
కర మరుదారంగ మందు కాటుక పెట్టెన్

సత్తికి సింగారించిన
ఇత్తడిసొమ్ములను బోలి ఎసగగ మేనన్

పుత్తడిసొమ్ములు తన కా
పత్తారణ కారణముగ బాగుగ తాల్చెన్

కంచెలలోపల కట్టి బి
గించెన్ చనుకట్టుదోయి గిరినాగుల నా
డించక హితుండికుడు వడి
వంచనతో పెట్టినట్టి వైకరి తోపన్

ఈలీల నలంకృతయై
యాలోల వెలింగి నప్పు డాశ్చర్యముగా
నీలాద్రిరాజు పట్టం
బో లోలత మెరయు పెద్ద భూతమొ యనగన్

అప్పుడు సోమయాజులు తదాకృతి వేంకటసాని యుక్తుడై
రెప్పలు మోడ్ప కర్మిలి నెరిం కని కూతుర నీకు తుల్యయౌ
ఒప్పులకుప్ప ఇప్పుడమి నొక్కెడ చూడము లోలవయ్యు బా
గొప్పెడు బాలలీల కడు నూనితి మేల్ బళి యంచు మెచ్చగన్

నీలాద్రిరాజు వార
స్త్రీలోలుండయ్యె నింక చెడి వైతరిణిన్
కూలు నిటులనుచు తెల్పెడి
పోలిక నంభోధి క్రుంకె ప్రొద్దు రయమునన్

అపకారి నీలభూపతి
అపయశ మల విష్టపముల నలమె ననంగా
విపులమగు కటికచీకటి
విపులాస్థలి నంబరమున విప్పుగ కప్పెన్

అంతన్ తారలు తోచె నంబరమునం దా నీలభూపాధముం
డెంతే చంద్రిని కూడ తత్తనువునం దింతైన సందీయ క
త్యంతంబున్ రసపొక్కు లిట్లు వొడమున్ తథ్యం బటంచున్ నభః
కాంతారత్నము తెల్పెనో యన మహా గాఢాతి ధౌతచ్ఛలిన్

తాను చంద్రరేఖనా నెసంగుదు నంచు
సాని పిప్పితొత్తు లోన నుబ్బ
దాని నేతు నంచు తా కోపమున వచ్చె
నో యనంగ చంద్రు డుదితుడయ్యె

అయ్యవసరంబున

వేంకటసోమయాజియును వేంకటసానియు శ్రద్ధులై కడున్
పొంకపు మాటలున్ వగలు బుద్ధులు తద్దయు చెప్పుకొంచు లో
గొంకక నీలభూవిభుని గొల్లెన లోనికి దాని దూర్చి పూ
కంకటి చెంగట న్నిలుప కన్గొని ఆ నరపుండు వేడుకన్

దిగ్గునలేచి దండమిడి ధీవర యజ్ఞము చేసినావు మున్
పగ్గెగ మేము మన్మథవిపద్దశ నుండి తొలంగ నిప్పుడీ
సిగ్గరికన్నె తార్చితివి చెప్పగ శక్యమె నీప్రభావ మీ
వగ్గివి గాక బాపడవె ఆరయ వేంకటసోమపీథిరో

యెద్దుమానసుడవు యేదాంతుగుడవు సో
మాదుగుడువు నీవు మామవైతి
మాకు పున్నె మెలమి చేకూరె నౌ చంద్ర
రేఖ మీరు చంద్రరేఖ వలన

నావుడు నత డిట్లనియెను
దేవా తావక కటాక్షదృష్టి వలన నే
కావించితి క్రతువిపు డిది
నీ వన్నియ చూచి వలచె నీలనృపాలా

కైశ్యంబు కందంబు ఘన గోధి చంద్రమః
ఖండంబు భ్రూ ద్వంద్వకము ధనుస్సు
చక్షుస్సులు చకోరపక్షు లోష్ఠంబు పీ
యూషసరస్సు పయోధరములు
మాతంగకుంభముల్ మలినరోమాళి పి

పీలికాశ్రేణి గంభీరనాభి
విషనిధి కటి మహావిపుల సువేది ప
త్తామరసంబు మదనసదనము

పాండు రాశ్వత్థభూరుహ పత్ర మిట్టి
సరస సౌందర్యవతియగు చంద్రరేఖ
నీకు దొరకెను సంభోగ నిహితలీల
దక్క నేలుము నీలాద్రి ధరణిపాల

దీనితల్లి యీమె నా నేస్తురాలు మే
మిరువురమును నీకు హితుల మెట్లు
సాకెదవొ యటంచు చంద్రి హస్తము తెచ్చి
అతనిచేత నుంచి అప్పగించి

ముప్పదియారేండ్లది ముం
దెప్పుడు నొక్కరుని పొందదేలాగున నీ
విప్పుడు దిద్దుకొనియెదో
మొప్పెతనము మాన్పవలయు ముందర పనిలో

అని మరియును

కం పేపారెడు మంచిగంధమును బుక్కా క్రొత్తపన్నీరు క
ప్రంపున్ వక్కలు నాకులున్ దబుకుతో పర్యంకమం దుంచి తా
దంపత్యో శ్చరకాల భోగ్యమను వృత్తంబుల్ మహోపస్వరం
బింపారన్ పఠియించి పేంకట మనీషీంద్రుండు మోదంబునన్

తారామార్గము చూచి మంగళముహూర్తం బిప్పు డేతెంచెగా
ఓ రాజాగ్రణి పుస్తెకట్టుమిక జాగూనంగ నేలా ధ్రువం
తే రాజా వరుణో యటంచు నుడువన్ తేజంబు దీపింప త
న్నారీకంఠమునన్ ఘటించెను సువర్ణప్రస్ఫురత్ సూత్రమున్

తలబ్రాలువోయ నవి జిల
జిల జాల్కొని మదనసదన స్నిగ్ధస్థలిపై
పొలిచెను భావి సురత సం
కలితేంద్రియ మిట్లు పైని కప్పునను గతిన్

అనంతరంబున వేంకటశాస్త్రి యిట్లనియె

యభస్వ పుష్పిణీం చంద్రరే ఖామల మఖీమిమాం
చంద్రరేఖాం భగవతీం త్వం నీలాద్రి ప్రజాపతే

త్వన్మందిరే బహుళ కాంచన సిద్ధిరస్తు
వంశాభివృద్ధి రధికాస్తు శివారవోస్తు
బాలార్కకోటిరచిరస్తు మలేతరాస్య
నీలాద్రి పుణ్యజనవర్య హరిప్రసాదాత్

అని యాశీర్వదించి యిట్లనియె

స్మరమంది రాంగణంబున
కర దంత క్షతములుంచి గాఢరతుల భీ
కరభంగి చేయ కిప్పుడు
తురతుర న వ్వెనుక మెల్ల త్రోయగ వలయున్

ఆకు పోక పెట్టి లోకువగా బట్టి
పూకు మెల్ల నిమిరి నూకవలయు
డాక చేసి పేగ తాకంగపో వద్దు
నీకు దక్కె చంద్రి నీలభూప

అప్పుడు వేంకటసాని యిట్లనియె

బాల సుమీ గోల సుమీ
బేల సుమీ గాఢరతుల పెంపేద కడున్

సోలింపక తూలింపక
పాలింపుము చంద్రి నీదు పాలయ్యే నికన్

డాసిండు విడెము మరుచే
గాసిం డగ్గరక మున్నుగా మచ్చికగా
చేసిండు సొమ్ము పిదపన్
నీసేతలకెల్ల నోర్చు నీలనృపాలా

అని చంద్రరేఖం జూచి యిట్లనియె

సచ్చోడా పబువీతడు
యెచ్చమునకు పచ్చమునకు యిచ్చలయిడిగా
యిచ్చును హెచ్చుగ కొలువుము
సచ్చు యిటుల సేరబోక సందర లేకా

దేవేరి కేరెదవు స
ద్భావంబున నితడు చేతబట్టిన నీ వో
పూవుంబోడిరొ విట సం
భావనపై తలపువిడిచి బత్తి కొలువుమా

పాటపాడు మటన్న పాడక యెలుగెత్తి
పదరి రోదనము చేసెదవు సుమ్మ
కాళ్ళొత్తుమని పేడ కడువడి నొత్తక
ఎదురొత్తమని పలికెదవు సుమ్మ
తములమందిమ్మన్న తమి నీక క్రమ్మర
నాకిమ్మటంచు పెనగెదువు సుమ్మ
రతికిరమ్మని పిల్వ రాగిల్లి డాయక
అదనున కడకు పోయెదవు సుమ్మ

తురకదండి కాడు దూదేకులియు కాడు
పసులవాడు కాడు బట్టు కాడు

మనలనేలునట్టి మనుజనాథుడితండు
సెప్పినట్లు నీవు సేయు చంద్రి

నాపుడు నతం డిట్లనియె

పుత్తడి కీలుబొమ్మ యనబోలెడు బోలెడుయోని చందిరిన్
హత్తగ తోడితెచ్చి విరహార్తి హరింపగ చేసినావు నీ
కుత్తమ భూషణాంబర సముత్కర మిచ్చెద వేగనందుమో
యత్త వలగ్న నిర్జిత వియత్తల వేంకటసాని జానుగన్

అన నవ్వుచు వారిద్దరు
చని రంతట నీలవిభుడు చంద్రిని కని నూ
తన మదనకేళి తేలెద
నని లోపల మోహమొదవి హస్తము పట్టన్

తలవంచి పట్టెకంకటి
గల దండము వట్టి వదలగానొల్లక తా
వెలవెల బోవుచు సిగ్గుం
గల బాలికవోలె పెనగగా నాతండున్

ముంగటి కుచ్చుపట్టుకొని మోహమునన్ తన శయ్య చేర్చి వా
రాంగనవింత సిగ్గువడ నర్హమె యెందర చక్కబెట్టితో
దొంగతనంపు టీ వగలుద్రోచి హసన్ముఖివయ్యి కౌగిటన్
లొంగగబట్టి నన్ను రతిలోలుని చేయుము నీకు మ్రొక్కెదన్

చంద్రుడు మింటనంటి సరసంబుగ నగ్నికరాళ విస్ఫుర
చ్చంద్రిక కాయజొచ్చె సుమచాపుడు బాణములేయజొచ్చెనో
చంద్రి విలాస విభ్రమ విశాల కళారసలీల మీరగా
సాంద్ర కృపా కటాక్షమున చక్కగ కన్గొని కోర్కెతీర్పుమా

సకలభాగ్యములిత్తు చక్కరకెమ్మోవి
చవులు చూపింపవే చంద్రరేఖ

శంబరాంతకు చేతి శరముల కోర్వను
చక్క కౌగిటడాచు చంద్రరేఖ
చలమేల పూనెదు వలపు నిల్పగజాల
చన్ను లంటగ నిమ్ము చంద్రరేఖ
తాళజాలను నీదు కాలికిమ్రొక్కెద
స్మరమందిరము చూపు చంద్రరేఖ

కడకు పోవక నెమ్మోము ముడుచుకొనక
సిగ్గు విడనాడి నను కటాక్షించి నీదు
కన్నెప్రాయంపు రతికేళి కలయనిమ్ము
జాగుసేయక కటకపు చంద్రరేఖ

నీకున్ దాస్యము చేసెద
నాకున్ గల ధనమొసంగి నానాగతులన్
పైకొని రతి నన్నేలుము
ప్రాకటముగ చంద్రసాని పల్లవపాణీ

సిగ విడిజార మోముపయి చెమ్మటబిందువులూర గబ్బి చ
న్నొగడలు నిక్కదేర తెగి ముత్తెపుపేరులు శయ్యచేరగా
భగ మతి సారమూర జలపంక కళంకిత జీలువారగా
వగ పురుషాయితంబున అవశ్యము నేలుము చంద్రరేఖరో

నా విని శరావసన్నిభ
కేవల సుస్నిగ్ధ మదనగృహము చెమర్పం
గా వాలు బెళుకుచూపుల
తా వలనుగ నతనిమోము తప్పకచూచెన్

ఇటువలె చూచిన నాతడు
తటుకున ఇదె సమయమనుచు తమితీరగ కౌ
గిటనొత్తి మోవిమధుపటు
గుటుకుగుటుకురనుచు కడుపుకొలదిన్ గ్రోలెన్

బుడ్డికుండలవంటి బుగ్గలు చుంబించి
గొౖరైబొౙ్జునుగేరు కురులు నిమిరి
కప్పచిప్పలవంటి కన్నులు ముద్దాడి
ఊదబొడ్డున కరం బూది నిలిపి
కొలిమితిత్తులబోలు కుచములు పీడించి
మరగాళ్ళ తెగడెడు కరములంటి
కొంగకంఠమువంటి కుతుక గోరులనించి
పులిబోనుబోలెడు పూకు చమిరి

పెడద కుంచములో వ్రేలుపెట్టినట్లు
యోనిలో కామదండము నొత్తి దూర్చి
పెనుకకును ముంగలికి నూగుకొనుచు నీల
ధారుణీశుండు వడివడి తాక నదియు

మును నల్లమందు మాజుము
తినియున్నది గాన మేను తిమ్మిరిగొని యా
తని తాకులకు చలింపక
తన నేరుపుకోపు చూపదలచి కడంకన్

భగము వికసింపజేయుచు
బిగబట్టుచు లోనచొర నభేద్యంబుగ త
ప్పగ త్రోయుచు బెణకించుచు
బిగితొడలం చుట్టిపట్టి బిట్టలరించెన్

పారదోపమ వీర్యధారాతత భగంబు
స్తన చర్మ భస్త్రికా తాడవంబు
కక్షప్రదేశ నిర్గత ఘర్మసలిలంబు
చక్రక్రమ చపేట చాలనంబు
భూరితరాపాన మారుతోద్ధూతంబు
ఘన దేహదుర్గంధ గంధిలంబు

శునకబంధవిశేష వినమిత మేఢ్రంబు
క్రీడారచిత పాదతాడనంబు

గార్దభస్వర నిస్సరద్ గ్రామ్యవచన
మమిత రోదనజల పూరితాననంబు
చంద్రరేఖాభిధాన వేశ్యానలాస్య
ప్రథమసురతంబు నీలభూపతి కరంచె

ఇవ్విధంబున సమరతి గావించి నప్పు డప్పుడుపుంబోటిమిన్న మున్నెరికంబున నన్నీలాద్రిరాజపుంగవుపై లంఘించి హుంకరించి జంకించుకయులేక సంకోచంబు మాని ఇంక నాచేతం జిక్కితి పెక్కడికి బోయెదవు నిలునిలు నా యుపరతి చమత్కారంబు తోరంబుగా జూపెద పరాకు కాకు రాకొమరా మారాడక నాకేమి మెప్పు లిప్పు డిచ్చెదవో మది నెంచుకొమ్ము అని చెక్కిలినొక్కి యక్కునం గ్రక్కునం తన లంబమాన పీన స్తనంబులు గదియించి నునుదొడల కుదియించి వదలని మదంబున ముదంబునం తన మదనసదనంబున నతని మేహనంబును నమోఘంబుగా తగిలించుకొని ముమ్మరమ్ముగా దొమ్మరికొమ్మ గడకదసి ఆడు చందంబున సంభ్రమించుచు లాగిపైచు చందంబున నొత్తుచు మేను మేన హత్తింపుచు తత్తరింపక కొంచెపడక దిట్టతనంబు తెచ్చుకొని విచ్చలవిడి ముచ్చటలెల్లం దీర చనుమిట్టల గట్టిగ బిగబట్టి యిట్టట్టు బెసగక తడంబడక గుట్టుచెడక చేతులు పట్టువిడక ఎదురుదట్టింపుమని చేయి మార్పుమని అడుగుతప్పెనని మించబలుకుచు కులుకుచు కోడెప్రాయంపు నాడెంపు సాలెవాడు ఘళుకుఘళుకుమన పలక చులుకగ దాటించు వాటంబున నోటువడక నీటుజూపుచు పరిభ్రమణవేగంబునం కర పాద భూషణ విశేషంబులు ఘల్లుఘల్లుమని భీషణంబుగ ఘోషింప న వ్వారయోషాలలామంబు పెదవిపెదవిం గదియ తన నిడుద వాడి మొనపంటింబట్టి పీల్చుచు చిరికుర్రవెండ్రుకలు తొర్రకొప్పువీడి యక్కటిప్రదేశంబున నటియింప కుండలంబులు గండతలంబునం తాండవింప గోరిదకొంప సొంపునం పెంపారు కంపుమేనుల సమానంబుగా క్రమ్ము ముమ్మరంపు చెమ్మటసోన లతని దుర్భరతర సంవృథమాన దేహశాల్మలీద్రుమంబునందు దిగజార పీరులసివంబెత్తిన లాగున నూగులాడుచుండం గని యాప్రజాపతి సేదదీర్చుకొని క్రమ్మర నమ్మరుదురంబున కెదిరించి వదలని చలమ్ము హెచ్చం బెచ్చు పెరుగు మచ్చరంబున సమదమ్ముగ నదుముకొనిన నదియు వదలక పదరుచు గుదికొన్న తమకమ్మునం దలంకక నెదురుదాక ధాక నిద్దరుం తద్దయు సంభ్రమంబును చలంబును జయకాంక్షయు మనంబునం బెనంగొన నగ్గలంబుగ నిగ్గుచు వెనుకకుం దగ్గుచు మొగ్గరించుచు పగ్గెలు సెప్పుకొనుచు చెండుచెండుగ బండబండగ తాకులాడు నెడ నచ్చంద్రరేఖ బహువిటజన సంయోగ జనిత చాతుర్య కళాధుర్య కావున

మొగ్గవేసి యోటువడం జేయ సమకట్టిన నా దిట్టమట్టిరేడును బహుగణికావిలాసినీ దాసికా సంభోగ సంభృత నైపుణీ గుణగణ గణ్యుడు కావున వెనుదీయక నునుతొడలం దానినడుము బిగించి మారొడ్డుచు తెబుకుతెబుకుమను చప్పుడు లుప్పతిల్ల బిట్టట్టుసేతల నెట్టుకొని గుట్టు వదలక పట్టువట్టి సూటితప్పకుండ గండుమీరి మూర్కొన్న మహిషంబుల డంబున చిత్తకుక్కల విధంబున చీంబోతుల ఖాతి మాలమాసటీండ్లం బోలె మార్జాలంబుల కైవడి మసకంపు పెనుబాముల చందంబున మదించిన కోడిపుంజుల మాడ్కి లకుముకుల లాగున గొర్రెపొట్టేళ్ళ ఖాతి గుంటుకతోలు లీల కొర్తవేసిన కైవడి చిట్టాముదముల గ్రుమ్మ నేర్పున గొంకుజంకు లేక సమరతి యుపరతి బంధంబులం దేల జిలజిల మరుజలంబులు జాలుకొని తదీయ శయ్యాతలంబునంబడి వెల్లివిరిసి సెలయేరులైపార మహామైథున సంకల్ప సంభోగ క్రీడావినోదంబులు సూపి అలసి సొలసి తొడలతొడలును బాహువులబాహువులును మోవినిమోవియు మొగంబునమొగంబును పదంబులపదంబులును నురంబుననురంబును భగంబునలింగంబును గదియ కౌగిలించుకొని దీర్ఘనిద్రా సమాయుక్త నేత్రులై పడియుండి రనంతరంబున

తమ్ముల చక్రమ్ముల నధి
కమ్ముగ బాధించు రాజు కాంతిదొరగి పే
గమ్మున క్రుంకెన్ తద్గతి
గ్రుమ్మరు నీలాద్రిరాజు క్రుంకకయున్నే

అల నీలాద్రి మహీపుం
డెలమిని చంద్రిని రమించి యెంతయు తేజో
బలహీనుడగుట తెలుపన్
తెలుపువొడమినట్లు తూర్పు తెలతెలవారెన్

ఇనవంశసంభవుండై
ఘనసన్మార్గంబు దొరగి కాముకుడౌ నీ
లన్నృపతి కాదన కినుకన్
చనుదెంచెననంగ నపుడు సవితృడు తోచెన్

అంత చింతలపాటి నీలాద్రిరాజు
మొగము వెలవెలబోవంగ నిగుడిలేచె
చంద్రరేఖయు ముఖకాంతి సడలి కనుల
నుసుముకొంచును మేల్కాంచి మసలుచుండె

అత్తరి నా రాజోత్తముండు దానిం గూర్చి యిట్లనియె

నావంటిరసికు డెందము
కేవలముగ కరగజేసి కేరుచు మిగులన్
భావభవకేళి దాసుని
కావించితి నీకు సాటి కా రేసానుల్

నీమొగము నీత్రికోణము
నీ మెరుగుంగన్నుదోయి నీ నునుదొడలున్
నీమోవి నీకుచంబులు
నామదినిక మరవజాల నమ్ముము బాలా

సొమ్ములు చీరలును వరాల్
సమ్మతమున నీకునిత్తు సత్యంబిక నా
సొమ్మయియుండుము విట సం
ఘమ్ములతో చెలిమిమాని కలికీ ఎపుడున్

సానిదాననంచు పూని లోలో వెచ్చ
కాంద్రకూడ నేను కాంచినపుడె
చన్ను ముక్కు యోనినున్న గొల్లియు జిర్రి
కొప్పుకోసి వెళ్ళగొట్టువాడ

రాయవరంబున నీ క
త్యాయత గేహంబు కట్టి యందుంచెద నీ
వేయెడకుపోక యుండుము
నీయండనె యుండువాడ నేనచ్చోటన్

నావుడు నదిట్టులనియెను దేవ నాకు
నీవు దయ దండ చిక్కుట కేవలముగ
సకల సామ్రాజ్యమిచ్చుటె సంశయంబు
లేదు నీదాన్నై యుందు మోదమునను

నీకంటె లోనిచుట్టము
నాకిచ్చెడువాడు కలడె నానాగతులన్
చేకొని కాపాడుము సుగు
ణాకర యెవ్వరినిజేర నరుగక యుందున్

అంత నంతకుమున్నె గోతియొద్ద నక్క చందంబున ద్వారబంధమ్ము కడ కాచుకొనియున్నవాడు కావున వేంకటసోమయాజి యిదంతయు నాలకించి తటుక్కున లోనికిం బ్రవేశించి యిట్లనియె

ఇషువినుము చంద్రరేఖా
భషకముపలె నిన్ను చేరబట్టి యెవరినిన్
విషయింపనీయ గట్టిగ
మృష కాదని పలికె మిగుల ప్రేమదలిర్పన్

అయ్యవసరంబున

ప్రాతపుట్టముకట్టి పూతచెందిరపెట్టి
పాతచెప్పులుమెట్టి చేతగట్టి
కోలపోలుచుబూని చాల మద్యంబాని
ప్రేలుకొంచును గూను గ్రాల యోని
పుండ్ల కీగలువ్రాల చండ్లు బొడ్డున తూల
కండ్ల పుసులు కార రొండ్లు ప్రేల
నోర దేగుడు కార ఊర బేరము మీర
సారె పయ్యెదజారి యోరజేర

దారి నెముకుచు బడబడ దగ్గుకొనుచు
అపుడు వేంకటసాని నీలాద్రిరాజు
గొల్లెనకు నాతులటుపాయ కొనుచు లోని
కరిగి చేయెత్తిమ్రొక్కి యిట్లనుచు పలికె

నీబానిసతొత్తిది దయ
చే బాసలనిచ్చి చాల చేపట్టుమికన్

గాబాగూబిగ చేయక
నీ బంతిని కూడు కుడుపు నీలాద్రినృపా

అనిన నతం డత్యంత సంతోషస్వాంతుండై యట్ల చేసెదనని దానికిం బీతాంబరాదికంబు లొసంగి చంద్రియె లోకంబుగా మెలంగుచుండె

రతిజేసి యలసిన ధృతి దాని మన్మథా
గార ద్రవంబెల్ల కడిగి తుడుచు
ఆకుచుట్టియొసంగినది తమ్మలముసేయ
దమ్మ గైకొని నోరద్రుమ్మి నమలు
అది మదిర కొనంగ నది మంచిదేయని
తచ్ఛేషహేల మోదమున త్రావు
నిదురించుతరి దాని పదములు తొడలు త్రి
కోణంబు సుఖముగా గ్రుద్ది పిసుకు

మెల్లనే దాని మంచము నల్లి చంపు
లావుగుబ్బల గంధమలంది నిడుద
క్రొమ్ముడిని పూవుటెత్తులగూర్చు వలపు
కులుక నీలాద్రిభూపాల మలహరుండు

ఇల్లెరుగక పట్టెరుగక
యెల్లధనము దానికిచ్చి యెగ్గును సిగ్గున్
చెల్లగ తత్పాదద్వయ
పల్లవముల దండ మురిసిపడి కాపుండెన్

పుడమిపై గూదలంజెకు బుడ్డపేడ్క
కాడనెడు మాట చంద్రరేఖకును నీల
ధరణివరునకు చెల్లెను తత్కథా వి
ధాన మెరిగించితిని నీకు తథ్యముగను

అనుచు తంబళ వీరభద్రార్యమణికి
నంబి నరసింహు డతులితానంద హృదయ

కమలుడై చెప్పి యంతట సముచితగతి
నతని వీడ్కొని చనె దేవతార్చనకును

వాచాగోచరముగ భువి
నాచంద్రార్కంబు కాగ హాస్యరసముచే
నా చంద్రరేఖ కథయును
నీ చరితము చెప్పినాడ నీలనృపాలా

ఈ కృతికి సమముగా కృతి
నే కవులును చెప్పజాల రిది బిరుదము భూ
లోకము రాజులలోపల
నీకు దొరకె హాస్యలీల నీలనృపాలా

ధరణియు మేఘమార్గమున తారలు తామరసాప్త చంద్ర ది
క్కరటి గిరీంద్ర శేషఫణి కంధి కిటీశ్వర కూర్మనాయకుల్
స్థిరముగ నెంతకాలము వసింతురు తత్క్రియ నీ ప్రబంధ ము
ర్వర సరసోత్తముల్ కవులు వర్ణనసేయగ నుండుగావుతన్

చేటీ వధూటికా కుచ
కోటీ సంలబ్ధ విపుల కోమల పంకో
త్పాటనకర ఖరనఖర ని
శాటోపమ ఘోరరూప ఆర్యదురూపా

రాచిరాజాన్వయా రామదావానలా
యాచకాస్తోక మేఘౌఘ ఝుంఝూనిలా
నీచవారాంగనా నిత్యరత్యాదరా
పాచకాధార నిర్భాగ్యదామోదరా

ఇది శ్రీమజ్జగన్నాథదేవ కరుణాకటాక్ష వీక్ష ణానుక్షణ సంలబ్ధ సరసకవితా విచిత్ర సలలితాపస్తంబసూత్ర కౌండిన్యసగోత్ర కూచిమంచికుల పవిత్ర గంగనామాత్యపుత్త్ర మానితానూన సమాన నానావిధరంగ త్రిలింగదేశభాషా విశేష భూషితాశేషకవితా విలాసభాసు రాఖర్వ సర్వలక్షణసార సంగ్రహోద్దామ శుద్ధాంధ్ర రామాయణప్రముఖ బహుళప్రబంధ నిబంధనబంధురవిధాన నవీనశబ్దశాసన బిరుదాభిరామ

తిమ్మకవిసార్వభౌమసహోదర గురుయశోమేదుర వివిధవిద్వజ్జనవిధేయ జగన్నాథనామధేయ ప్రణీతంబైన చంద్రరేఖావిలాపంబను హాస్యరసప్రబంధరాజంబునం తృతీయాశ్వాసంబు సర్వంబును సంపూర్ణము

oooooooooooooooooooooooooooo